నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 6 ఫిబ్రవరి 2025 | YADADRI BHUVANAGIRI

మూడో రోజు ఇద్దరి నామినేషన్

నీలగిరి, ఫిబ్రవరి 5 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజవర్గానికి జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా మూడో రోజు బుధవారం ఇద్దరు అభ్యర్థులు మూడు సెట్ల నామినేషన్లను జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠికి సమర్పించారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలానికి చెందిన బంకరాజు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్, కాంగ్రెస్ పార్టీ తరుపున మరోసెట్ దాఖలు చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన పన్నాల గోపాల్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ వేశారు. ఇప్పటివరకు మొత్తం ముగ్గురు అభ్యర్థులు నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్ఓ తెలిపారు. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

7న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి నామినేషన్

ఈ నెల 7న తాను నామినేషన్ దాఖలు చేయనున్నట్లు టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్ నుంచి ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ప్రచార కమిటీ ఆధ్వర్వంలో ర్యాలీగా బయల్దేరి మధ్యాహ్నం ఒంటి గంట లోపు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు పేర్కొన్నారు. తమకు మద్దతు ప్రకటించిన వివిధ సంఘాల నేతలంతా ర్యాలీలో పాల్గొననున్నట్లు బుధ వారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

భగ్గుమంటున్న బీసీలు

కుల గణన తప్పుల తడకగా ఉందంటూ ఆగ్రహం

- పలుచోట్ల సర్వే ప్రతుల దహనం
- బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపడమేంటని ప్రశ్నలు
- ప్రభుత్వం తీరుపై మండి పడుతున్న బీసీ సంఘాలు

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : కుల గణనలో తగిన ప్రామాణికాలు పాటించ లేదని, ఫలితంగా బీసీల సంఖ్య తగ్గిపోయిందని ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా బీసీ సామాజికవర్గంతోపాటు సంఘాల నేతలు తీవ్రంగా మండి పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెల్లడించిన కుల గణన నివేదికలో బీసీ సంఖ్యను తక్కువ చేసి చూపించడం అన్యాయమం టూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీల భవితవ్యాన్ని నిర్ధేశించే, కోటాను నిర్ధారించే నివేదికపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తుందని దుయ్యబడుతున్నారు. సర్వే నివేదికలోని తప్పులను సరిదిద్దకుండా ప్రభుత్వం ముందుకు సాగితే బీసీలకు తీవ్ర అన్యాయం చేసినట్లేనని స్పష్టం చేస్తున్నారు. గత జనాభా లెక్కలతో పోలిస్తే ప్రస్తుత కుల గణన నివేదిక కరెక్ట్ కాదని తెలుస్తుందని చెప్తున్నారు. కుల గణన నివేదికలో బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపడం ద్వారా రానున్న కాలంలో ఉద్యోగాలు, రాజకీయ అవకాశాల్లో తగిన ప్రాతినిధ్యాన్ని బీసీలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వెల్లడించిన కుల గణన వివరాలపై ఎన్నో అభ్యంతరాలు ఉన్నాయని, ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదని అంటున్నారు. కులగణన నివేదికపై దిద్దుబాటు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. బీసీ కులగణన విషయంలో ప్రభుత్వ వ్యవహారశైలిని తీవ్రంగా తప్పు పడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల బీసీ సంఘాల నేతలు ఆందోళనకు దిగుతున్నారు.

నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో కులగణన రిపోర్టు ప్రతులతో నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

ప్రభుత్వ నివేదికను అంగీకరించం

బీసీలు 46 శాతమే ఉన్నారని చెప్తున్న ప్రభుత్వ నివేదికను తాము అంగీకరించబోమని నల్లగొండలో తేల్చిచెప్పారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి గొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో బీసీ విద్యార్థి, సంక్షేమ సంఘాలతోపాటు విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో కులగణన నివేదికలను దహనం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కులగణన రిపోర్టులను తిరస్కరిస్తున్నట్లు ఈ సందర్భంగా బీసీ సంఘాల నేతలు పందుల సైదులు, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఐతగోని జనార్థన్‌గౌడ్ ప్రకటించారు. పలుచోట్ల బీసీ సంఘాల ఆధ్వర్వంలో కులగణన నివేదికపై ఆందోళనలు కొనసాగాయి.

రామరాజు మాట్లాడుతూ 2014లో కేసీఆర్ ప్రభుత్వం ఒక్క రోజులో జరిపిన కుటుంబ సర్వేలో బొంబాయి వంటి ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారు సైతం సర్వేలో పాల్గొన్నారని గుర్తు చేస్తూ... ఆ నాటి సర్వేలోనే 51 శాతం బీసీలు తేలిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వేలో మాత్రం తక్కువగా ఎలా ఉంటారని ప్రశ్నించారు. నల్ల

కులగణనలో పారదర్శకత కరువు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆధిపత్య వర్గాలే కులగణనను సక్రమంగా జరుగనివ్వ లేదు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై వెనుకబడిన వర్గాలు తిరుగబడుతాయని ముందే పసిగట్టి ఓసీ జనాభాను పెంచి చూపించారు. 2014లో కేసీఆర్ ఒక్క రోజులో సమగ్ర కుటుంబ సర్వే చేశారు. అప్పుడు ఎలాంటి విమర్శలూ రాలేదు. కాంగ్రెస్ పార్టీ 50 రోజులు సర్వే చేసినా పారదర్శకత లోపించింది. సర్వే చేసిన ఎన్యూమరేటర్లపై ఉన్నతాధికారులు నియంత్రణ చేశారు. ప్రభుత్వ కుల గణనను చాలా చులకనగా చూశారు. అందుకే తప్పుల తడకగా సర్వే జరిగింది. ఈ సర్వే 100 శాతం వాస్తవికం అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం సరైంది కాదు. వార్డుల వారీగా, గ్రామ, మండల, జిల్లాల వారీగా జనాభా ఎంత ఉందో యూనిట్లను ప్రకటించాలి. కాంగ్రెస్ సంకలు గుద్దుకున్నంత మాత్రాన సామాజిక న్యాయం అమలైనట్లు కాదు.

- పందుల సైదులు, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు, నల్లగొండ

బీసీలను తగ్గిస్తే ఊరుకునేది లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి బీసీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తుంది. కుల గణన సర్వేలో బీసీ జనాభాను తగ్గించి చూపడం దారుణం. 2011 నుంచి నేటి వరకు రాష్ట్రంలో బీసీల జనాభా పెరిగిందే తప్ప తగ్గలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్వే లెక్కల కంటే బీసీ జనాభాను తగ్గించి రిజర్వేషన్‌ను కూడా తగ్గించే ప్రయత్నం చేస్తుంది. గత సర్వేలో ఓసీలు 7శాతం ఉంటే ప్రస్తుతం 16శాతానికి ఎలా పెరిగారు.? బీసీలు ఎలా తగ్గారో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. బీసీ జనాభా పెరిగితే రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందని ప్రభుత్వం తగ్గించి అణివేసే ప్రయత్నం చేస్తుంది. దీనివల్ల బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదు. ప్రభుత్వం పునారాలోచించి కుల గణన లెక్కల సర్వేను సవరించాలి.

- నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, సూర్యాపేట

కులగణన ఓ నాటకం

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ కులగణన కేవలం మొక్కుబడి ప్రక్రియ. రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి ఆడుతున్న నాటకం. సామాజిక అభ్యున్నతి కోసం ఆలోచన చేసి నిజాయతీగా చేపట్టినట్లుగా లేదు. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సామాజిక న్యాయ జపం చేయడంతో ఇక్కడ ఉన్న అగ్రకులాల నాయకులు ఆయన మాటలను గౌరవించినట్లుగా నటించి బీసీ కులగణన చేశారు. అందుకే ఆ పార్టీ ఎమ్మెల్సీ బహిరంగంగానే సర్వే రిపోర్టును తగులబెట్టారు. దీని వెనుక ఆ పార్టీ నాయకుల కుట్ర ఉందని అనడంతో ఈ నివేదికలకు ప్రాధాన్యత లేకుండా పోయింది. సర్వేను మొక్కుబడి కార్యక్రమంగా పూర్తి చేసి 46 శాతం రిజర్వేషన్లు ఇస్తామని అంటూనే మళ్లీ కేంద్ర ప్రభుత్వం అని మెలిక పెట్టడం వెనుక కుట్ర ఉన్నది. ఇలాంటి చౌక బారు ఆలోచనలు చేయడం సీఎం రేవంత్‌కు కొత్తేం కాదు. జనం ఇలాంటి ప్రభుత్వాన్ని నమ్మకుండా సామాజిక న్యాయం కోసం ఉద్యమాలు చేయాలి.

- పుట్ట కిశోర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, సూర్యాపేట

అన్యాయం చేయాలని చూస్తున్నారు

ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో అసంపూర్తి సమాచారం ఉంది. అగ్ర వర్ణాల కులస్తుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సర్వే చేసినట్లు అనిపిస్తుంది. 100 శాతం సర్వే చేయకుండా నామమాత్రంగానే చేసి బీసీ జనాభాను కావాలనే తక్కువ చేసి చూపారు. గతంలో తక్కువున్న ఓసీ సంఖ్య పెరిగినప్పుడు బీసీల సంఖ్య ఎలా తగ్గుతుందో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. కేవలం బీసీ ఓట్ల కోసం కులగణన చేపట్టి, 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాను 46 శాతమే అని చూపెట్టడం విచారకరం. ప్రభుత్వ లెక్క ప్రకారం ఇంకా 8 శాతం సర్వే జరుగలేదని చెప్పడమే ఇందుకు ఉదాహరణ. పదేండ్లలో కేవలం 2 లక్షల జనాభా బీసీలు పెరిగారని చూపెట్టడం విడ్డూరం. మరోసారి కుల గణన చేపట్టి బీసీ జనాభా ప్రకటించాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ స్థానాలు పెంచి బీసీలకు రాజకీయంగా ప్రోత్సహించాలి.

- పెద్దిశెట్టి సత్యనారాయణ, బీసీ నాయకుడు, కొండమల్లేపల్లి

నిజ నిర్ధారణ కమిటీ వేయాలి

బీసీ కుల గణనను కాంగ్రెస్ పార్టీ బాధ్యతగా చేపట్టలేదు. సర్వే రిపోర్టులో నిజాలు దాచిపెట్టింది. రాష్ట్రంలో బీసీ జనాభా 51శాతం ఉందని గతంలో సర్వేలు వెల్లడించాయి. కాంగ్రెస్ ప్రభుత్వ చేపట్టిన సర్వేలో మాత్రం 46 శాతమే ఉండడమేంటి.? దీనివల్ల బీసీలకు తీరని అన్యాయం జరుగబోతున్నది. గతంలో 10 శాతం ఉన్న ఓసీలు నేడు 15 శాతానికి ఎగబాకారని తాజా సర్వే చెప్పింది. ఇది ముమ్మాటికి బూటకపు సర్వే. బీసీలను తక్కువ చూపడం వల్ల ఎన్నికల రిజర్వేషన్లు తారుమారు అవుతాయి. జనాభా ప్రాతిపదికన కులాల శాతాన్ని బట్టి నిధులు కేటాయిస్తే నష్టపోయేది బీసీలే. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీ బలగాన్ని కావాలనే తక్కువ చేసి చూపిస్తుంది. కులగణనపై నిజ నిర్ధారణ కమిటీ వేసి నిజం నిగ్గు తేల్చాలి.

- చౌగాని భిక్షం గౌడ్,
జిల్లా రైతు బంధు సమితి మాజీ సభ్యుడు, మిర్యాలగూడ

రిపోర్టును గ్రామాల వారీగా ప్రకటించాలి

రాష్ట్ర జనాభాలో 60శాతం ఉన్న బీసీలను కేవలం 46శాతానికి చూపిస్తూ కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ జనాభాను తగ్గించాలనే ప్రయత్నం చేస్తుంది. కేసీఆర్ పాలనలో సమగ్ర సర్వే చేసినప్పుడు 56శాతం బీసీలను గుర్తించగా 46శాతం ఉందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం బీసీలను అవమానించడమే. కుల గణన రిపోర్టులను గ్రామాల వారీగా ప్రకటించి బీసీలపై ఉన్న చిత్తశుద్ధిని ప్రకటించుకోవాలి. పంచాయతీ ఎన్నికలకు బీసీ రిజర్వేషన్‌ను 50శాతానికి పెంచి నిర్వహించాలి.

- కూనూరు శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం
రాష్ట్ర నాయకుడు, రామన్నపేట

అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను మార్గమధ్యంలో అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని కంచనబాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

మాజీ సర్పంచ్‌ల నిర్బంధం

- చలో హైదరాబాద్ వెళ్లకుండా అరెస్టులు

మోత్కూరు, భూదాన్‌పోచంపల్లి, ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 5 : పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న మాజీ సర్పంచ్‌లపై ప్రభుత్వం రెండోరోజూ నిర్బంధ కాండను సాగించింది. మంగళవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసుల ద్వారా అరెస్టుల పర్వం సాగించగా, గురువారం కూడా అరెస్టులు కొనసాగాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు మండలాల నుంచి మాజీ సర్పంచ్‌లు చలో హైదరాబాద్‌కు వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేసి హైదరాబాద్‌లోని పలు స్టేషన్లకు తరలించారు. మోత్కూరు మండలానికి చెందిన మాజీ సర్పంచ్‌లను కంచన్‌బాగ్ స్టేషన్‌కు, భూదాన్‌పోచంపల్లి మండలానికి చెందిన వారిని నగరంలోని షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆత్మకూర్.ఎం మండలానికి చెందిన వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉంచి సాయంత్రం తర్వాత వదిలిపెట్టారు. పెండింగ్ బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్న తమపై ప్రభుత్వ నిర్బంధకాండను మాజీ సర్పంచ్‌లు తీవ్రంగా ఖండిస్తున్నారు.

షాపులోకి దూసుకెళ్లిన కారు

షాపులోకి దూసుకెళ్లి పల్టీ కొట్టిన కారు

బీబీనగర్, ఫిబ్రవరి 5 : కారు స్టార్ట్ చేసి ఒక్కసారిగా ఎక్స్‌లేటర్ ఇవ్వడంతో అదుపు తప్పి ముందున్న షాపులోకి దూసుకెళ్లి కారు పల్టీ కొట్టింది. ఈ ఘటన బుధవారం బీబీనగర్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొల్లు రాజు కారు స్టార్ట్ చేసి ఒక్కసారిగా ఎక్స్‌లేటర్ ఇవ్వడంతో అదుపు తప్పి పక్కన ఉన్న టూ వీలర్‌ను ఢీ కొట్టి షాపులోకి దూసుకెళ్లింది. దీంతో కారు పల్టీ కొట్టింది. షాపు యజమానికి గాయాలు కాగా దవాఖానకు తరలించి చికిత్స అందించారు.

బీసీలను కాంగ్రెస్ దగా

తప్పులకుప్పగా సర్కారు బీసీ కుల గణన

- సీఎం రేవంత్‌రెడ్డిది బీసీ వ్యతిరేక దృక్పథం
- కేంద్రంపై నెట్టి రిజర్వేషన్లు తప్పించే కుట్ర
- మళ్లీ శాస్త్రీయంగా బీసీ కుల గణన చేపట్టాలి
- బీసీలంతా ఏకమై రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలి
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్య గౌడ్

బూడిద భిక్షమయ్య గౌడ్

యాదాద్రి భువనగిరి, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ బీసీలను మొదటి నుంచి మోసం చేస్తూనే ఉందని, మరోసారి తన బుద్ధిని చూపించిందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్యగౌడ్ విమర్శించారు. బీసీ కుల గణన తప్పుల కుప్పగా మారిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీసీల శాతం తగ్గి ఓసీల శాతమే పెరగడమేంటని ప్రశ్నించారు. ఇక్కడే ప్రభుత్వం చిత్తశుద్ధి అర్థమవుతున్నదన్నారు. అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపించిందని, వారిపై నెపం నెట్టి బీసీలను మరోసారి దగా చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కారు కుట్రలకు తెరలేపిందని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా కచ్చితంగా అమలు చేయాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బుధవారం బీసీ కుల గణనపై నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూలో భిక్షమయ్యగౌడ్ పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

మొదటి నుంచీ మోసమే..

'మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తూ వస్తున్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ చేసింది. అసెంబ్లీలో పాలితులే పాలకులు ఉండాలని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించాలని అనేక విధాలుగా ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్, బీసీ సంఘాలు ఒక పోరాట పటిమతో 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేదాకా వదిలిపెట్టేది లేదని హెచ్చరించడంతో వెనక్కి తగ్గారు. వెంటనే తూ.తూ.మంత్రంగా బీసీ కమిషన్ వేశారు. ఈ కమిషన్‌తో అయ్యేది కాదు.. పోయేది కాదని తీవ్రంగా వ్యతిరేకించాం. దాంతో మళ్లీ డెడికేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సమయంలోనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా.. రేవంత్ రెడ్డి కలుగజేసుకుని మాట్లాడారు. కేవలం రాహుల్ గాంధీ చెప్తున్నారనే తాము బీసీ కుల గణన చేస్తున్నామని, తమ నాయకుడి అభిప్రాయం మేరకు చేపడుతున్నామని స్వయంగా చెప్పారు. కుల గణన చేయడానికి సీఎంకు ఇష్టం లేదనడానికి ఇది నిదర్శనం. ఇవన్నీ మొదటి నుంచే అనుమానాలు ఉన్నాయి.

ఓసీలు పెరిగి.. బీసీలు తగ్గారా..?

బీసీ కుల గణన కోసం 56 ప్రశ్నలతో ప్రశావళి తయారు చేశారు. బీసీలా కాదా? రేషన్ కార్డు ఉందా, లేదా? అని అడగకుండా అనవసర ప్రశ్నలు వేసి ప్రజలను గందరగోళపరిచారు. ఆయన మొదటి నుంచే బీసీలకు వ్యతిరేకంగా ఉన్నారు. రెడ్లే సమర్థ నాయకులని స్వయంగా రేవంత్ రెడ్డి అనేక సందర్భాల్లో చెప్పారు. 2014లో కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో సమగ్ర కుటుంబ సర్వే చేస్తే బీసీలు 52 శాతం ఉందని తేలింది. కాంగ్రెస్ సర్వేలో కేవలం 46శాతం మాత్రమే వచ్చిందంటే అర్థం చేసుకోవచ్చు. పదేండ్లలో బీసీ సంఖ్య తగ్గుతుందట! ఓసీల సంఖ్య మాత్రం పెరుగుతుందట! సీఎం దృక్పథం ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ అడిగిన ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వలేదు.

కేంద్రంపై నెట్టే ప్లాన్..

బీసీ కుల గణన తీర్మానం తూ.తూ.మంత్రంగా చేపట్టి ఢిల్లీకి పంపారు. కేంద్రానికి పంపిస్తే వాళ్లు అమలు చేయరు. అది అందరికీ తెలిసిందే. కేంద్ర సహకారం లేదని బీజేపీపై నెపం నెట్టి మళ్లీ బీసీ రిజర్వేషన్లు తప్పించుకోవాలనే కుట్ర చేస్తున్నారు. రాష్ట్రంలో మళ్లీ శాస్త్రీయంగా బీసీ కుల గణన చేయాలి. ఇప్పుడు సర్వేలో బీసీల శాతం ఎందుకు తగ్గిందో సమాధానం చెప్పాలి. దానిపై జవాబు చెప్పకుండా ఊరికే దాటవేయడం ఏంటి? బీసీలకు స్థితిగతులను రూపుమాపడానికి, అణగదొక్కడానికి రేవంత్ రెడ్డి పెద్ద కుట్రకు తెరదీశారు. బీసీలంతా ఐక్యంగా ముందుకు సాగాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించి బుద్ధి చెప్పాలి.

మోటకొండూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

కుల గణన సర్వే తప్పుల తడక

- బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- కామారెడ్డి డిక్లరేషన్‌ను స్థానిక ఎన్నికల్లో అమలు చేయాలి
- సర్వే అంతా బోగస్ అని కాంగ్రెస్ ఎమ్మెల్సీనే చెప్పిండు
- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

మోటకొండూర్, ఫిబ్రవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుల గణన సర్వే అంతా తప్పుల తడకగా ఉందని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. బుధవారం మోటకొండూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం 2014లో పండుగ వాతావరణంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిందని, ప్రతి ఒక్కరూ సర్వేలో పాల్గొన్నారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌ను తుంగలో తొక్కి, కులగణన పేరుతో కాలయాపన చేయడమే గాక కోట్ల రూపాయలు వృధా చేసిందని మండిపడ్డారు. సర్వే పూర్తిస్థాయిలో చేయలేదని, రాష్ట్రంలో ఇంకా 3.1శాతం కుటుంబాలు మిగిలి ఉన్నాయని చెప్పడం ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమని పేర్కొన్నారు. కుల గణన సర్వే అంతా బోగస్ అని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీనే చెప్పి సర్వే పత్రాలను తగుల బెట్టారని గుర్తుచేశారు. 14 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టింది ఏమీలేదని, నమ్మించి మోసం చేసే ప్రభుత్వంగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. అంతకుముందు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి నర్సిరెడ్డికి కాలు ఆపరేషన్ కాగా ఆయన్ని, చామాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు యెల్లంల సంజీవరెడ్డి తల్లి మణెమ్మ ఇటీవల మృతి చెందగా ఆయన్ని పరామర్శించారు. కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు భూమండ్ల ఐలయ్య, బొట్ల నర్సింహ, అనంతుల జంగారెడ్డి, ఎండీ బురాన్, మల్ల గౌరయ్య, సిరబోయిన నర్సింగ్‌యాదవ్, జివిలికపల్లి వెంకటేశ్, బొట్ల మహేశ్, దడిగ మధు, బొట్ల ప్రశాంత్ పాల్గొన్నారు.

భూనిర్వాసితులతో కలిసి మాట్లాడుతున్న కమిటీ కన్వీనర్ వల్దాస్ రాజ్‌కాళభైరవ

భూ నిర్వాసితులకు నష్ట పరిహారాన్ని చెల్లించాలి

- భూ నిర్వాసితుల కమిటీ కన్వీనర్ వల్దాస్ రాజ్‌కాళభైరవ

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 : బస్వాపురం ప్రాజెక్టు ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపురం గ్రామస్తులకు అందని ఇండ్ల నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని భూ నిర్వాసితుల కమిటీ కన్వీనర్ వల్దాస్ రాజ్‌కాళభైరవ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి ఈ గ్రామస్తులతో మాట్లాడుతూ గెలిచిన నెల రోజుల్లో భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి గెలిచిన తరువాత ముఖం చాటేశాని విమర్శించారు. ముంపు బాధితులకు నష్ట పరిహారం కింద మంజూరైన రూ.50కోట్లను నేటికీ బాధితుల ఖాతాల్లో జమ చేయకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే తప్ప చేతల్లో లేదని ఎద్దేవా చేశారు. గ్రామంలో నిరుపేదలకు చెందిన పెంకుటిండ్లు, పూరిండ్లు, మట్టిగోడలు పూర్తిగా ధ్వంసమై శిథిలావస్థకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లు కూలిపోతున్నాయని, ఎవరికి ప్రమాదం జరిగినా పూర్తి బాధ్యత ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. రూ.కోట్లు విలువ చేసే సాగు భూములకు నామమాత్రపు విలువను కట్టి తీసుకుంటూ, నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు.

బస్వాపురం కట్టపై భూనిర్వాసితులు ఆధ్వర్యంలో చేపడుతున్న సమ్మెకు ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పూర్తి స్థాయిలో మద్దతు తెలిపి నిర్వాసితులకు అండగా నిలుస్తామని అప్పుడు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరిస్తున్నారన్నారు. నష్ట పరిహారం చెల్లించడంలో అలసత్వం వహిస్తే భూ నిర్వాసితులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో భూ నిర్వాసితులు పిన్నం నారాయణ, ఉడుత వీరస్వామి, మణికంఠ, బిచ్చాల మహేశ్, నవీన్, బాలు, పిన్నం గనేశ్, పాండు, లక్ష్మి, అనసూయ, పద్మ పాల్గొన్నారు.

కల్యాణతంతు జరిపిస్తున్న అర్చకులు

రమణీయం.. పార్వతీ జడల రామలింగేశ్వరుల కల్యాణం

- చెర్వుగట్టు భక్తజన క్షేత్రం
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు

పట్టు వస్త్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే వీరేశం దంపతులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 05 : ప్రసిద్ధ శైవ క్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం బుధవారం తెల్లవారుజామున అత్యంత వైభవంగా జరిగింది. ప్రభుత్వ తరపున నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కృష్ణ స్వామి, అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. లక్షలాది తరలివచ్చిన భక్తులతో చెరువుగట్టు క్షేత్రం కిక్కిరిసింది. ఓం నమః శివాయ నామస్మరణ మార్మోగింది. తెల్లవారుజామున మేళతాళాలు, శివ సత్తుల నృత్యాల నడుమ స్వామి వారిని నంది వాహనంపై, అమ్మవారిని గజ వాహనంపై తీసుకువచ్చి ఎదుర్కోలు మహోత్సవం జరిపించారు. అనంతరం కళ్యాణ మండపంలో తీసుకువచ్చి జీల కర్ర బెల్